# అతనెవరు

**అప్సర**

అప్పుడే సాయంత్రం అయిదున్నర అవుతూంది. వాసుదేవరావు పరీక్షహాల్లో వాచరువలె ప్రతినిముషం జేబుగడియారం చూస్తూ, అస్థిమితంగా పచారు చేస్తున్నాడు. ఓ సోఫాలో వాసుదేవరావు భార్య శాంతమ్మ బెంగపడినట్లు వాసుదేవరావుని తదేకధ్యానంగా చూస్తూ కూచుంది. కులాసాగా టేబిల్ పై కాలుపెట్టుకుని స్పోర్ట్సు రివ్యూ చదువుతూ కూచున్నాడు వాసుదేవరావు కుమారుడు నాగేష్. కారు పోర్టికోలో సిద్ధంగా నిల్చుంది. గేటువద్ద హాజరుగా బంట్రోతు. వాసుదేవరావు పచారుచేస్తూ మధ్య మధ్య తనలో తనే ఏదో గొణుగుతున్నట్లు వినవస్తూంది. చివరికి నాగేష్‌ని చూసి వాసుదేవరావు "అసలు యీ యింట్లో ఎవరికీ ఈ పెండ్లిగురించి చింతే లేనట్టుంది" అన్నాడు.

వెంటనే శాంతమ్మ "మీ రో గడియ కూచుందురూ, అదే వస్తుంది" అంటూండగా మాటలో మాట అందుకుని వాసుదేవరావు "ఊరుకునే వున్నాను. ఊరుకోక ఊరేగుతున్నానా" అన్నాడు.

"మంచి నీళ్లిమ్మంటారా — యిలా కూచోండి" అంది శాంతమ్మ. నాగేష్ ముఖం కనబడకుండా పత్రిక అడ్డుపెట్టుకుని చదువు సాగిస్తున్నాడు.

తిరిగి వాసుదేవరావు ప్రారంభించేడు "మూడు రోజులనుంచి చెబుతున్నా దానికి– యీ క్లబ్బులు, మహిళాసభలు యీ వాటికీ విడిచిపెట్టమని — అబ్బే లక్ష్యం వుంటేగా — యింతకీ దాన్ననవలసిన పన్లేదు. అలా తయారుచేసిన తల్లిననాలి" అని భార్యవంక కొర కొర చూస్తున్నాడు.

శాంతమ్మ దిగ్గునలేచి నాగేష్‌వద్దకెళ్లి "నాయనా; ఓసారి వెళ్లిరాగూడదట్రా — ఆయనంత చీకాకుపడుతున్నారు," అంది.

వెంటనే వాసుదేవరావు అందుకున్నాడు "అదే నేననేదీని. ఏదో యింతా నాకోసం; నా చికాకు తగించడానికనేగాని— అయ్యో టయిమవుతూంది. ట్రెయిను తప్పిపోతామేమో — ఏం రసాభాసవుతుందో అన్నజ్ఞానం ఒక్కళ్లకైనా వుందా అంటా? ఈ పెళ్లి తనకిష్టంలేకుంటే మొదటే చెప్పవలసింది. అన్నీ అయిందాకా నోరుమూసుకు కూచున్నాడు."

నాగేష్ లేచి "ఇంతకీ నాన్నా, నావల్లనే, యీ ఆలస్యం అవుతూందంటారా? ఇప్పుడుమాత్రం నేను యీ పెళ్లి యిష్టంలేదని అంటున్నానా" అన్నాడు.

"ఇష్టం వున్నవాడివి మీ చెల్లెల్ని సిద్ధంగా ఉంచలేక పోయేవేం" అన్నాడు వాసుదేవరావు.

"నేను వెళ్ళిమాత్రం యేంజెయ్యాలి? అదా ఆడవాళ్లక్లబ్! డ్రైవరు చెప్పనే చెప్పేడు రూప స్టేజెక్కి ప్రసంగిస్తూందనీ– మాటాడ్డానికి వీలుచిక్కలేదనీ" అన్నాడు నాగేష్.

"సమయం బాగుందని గజ్జెగట్టుకు నాట్యమాడుతూంది గాబోలు" అని తిరిగి పచారు జోరుచేసేడు వాసుదేవరావు.

శాంతమ్మ ఓసారి కొడుకుని వెళ్లిరమ్మని సౌజ్ఞ చేసింది. నాగేష్ బయల్దేర బోతూవుంటే రూప నాలుగైదుపూలమాలలు చేత్తో పట్టుకుని గబగబా ప్రవేశించింది.

"ఇంకోగంట నాట్యంచేస్తే తీరిపోనుగా– హాయిగా అందరం పడుకుని వుండేవాళ్లం. అంతత్వరగా ముగించేవేం" అన్నాడు వాసుదేవరావు రూప నుద్దేశించి.

"నాన్నా! క్షమించండి. అసలు అయిదు గంటలకు లేచివద్దామనే వెళ్తే, నన్ను సెక్రెటరీగా ఎన్నుకున్నారు. దాన్తో బయటపడ్డానికి వీలుచిక్కిందిగాదు" అంది రూప.

"అవును మరి, అన్నయ్యపెళ్లి. రేపు గాకుంటే ఎల్లుండవుతుంది. క్లబ్ వొదులుకుంటే ఎలాగ? సిగలేకపోతే సరి–నడవండి, యింకేమేనా ఆలస్యం ఉందా" అన్నాడు వాసుదేవరావు.

శాంతమ్మ హడావుడిగా లోనికి వెళ్లొచ్చింది. అందరూ మొత్తానికి గబగబ బయటకొచ్చేరు. వాసుదేవరావు చేతికర్ర పుచ్చుకుని ఇల్లు జాగ్రత్తని వంటవాడికీ నౌకర్లకూ చెప్పి కారెక్కేరు. అంతా కారులో కూచున్నాక నాగేష్ డ్రైవర్ని సామానంతా వచ్చినట్టేనా అని అడిగి నిర్ధారణ చేసుకున్నాక కారు కదిలింది. ఇంకా ట్రెయినుకు పదిహేను నిముషాలు టైముంది.

రిజర్వుడు సీట్లు కనుక పర్వాలేదు. అందుతామని నమ్మకం కుదిరింది. అయిదు నిముషాలు టైముండగా కారు రెయిల్వేస్టేషను చేరింది. వాసుదేవరావు ఆత్రుతతో దిగి "నేను మన కంపార్టుమెంటు వెదికి సిద్ధంగావుంటాను— సామాన్లు పట్టించుకు మీరంతా వేగంరండి" అని చెబ్తూ లోనికి నడిచేడు. ప్లాట్‌ఫారమంతా ఏక కోలాహలంగావుంది. ప్రతీవాళ్లూ నిప్పుమీద నడుస్తున్నట్టుగానే కనబడుతున్నారు. నడిచే వాళ్ళను తోసుకుంటూ ట్రాలీ కూలీలు, ఆమధ్య తోపుడుబండ్లతో వర్తకులు, నడిచే వారిని ఆపి ఏదో విషయం మాటాడేవారూ ఒకటేమిటి– చెప్ప నలవికాదు.

వాసుదేవరావు ఆమధ్యనించి తోసుకు గబగబా నడుస్తుండగా ట్రెయిను బొంయ్‌మని కూసింది. దాన్తో వాసుదేవరావు అదిరిపడి ఓసారి వెనక్కి చూసి, తిరగడంలో, చేతికర్ర కట్టుపంచకు చిక్కుకుని పడిపోబోయాడు. ఎదురుగా యిటువంటి వాళ్లని రక్షించడానికే నిలుచున్నట్లు గబాలున ఓ నడివయస్సూ, విలువైన దుస్తులు వేసుకుని యీవెనింగ్ హేటూ, చేతులో పెపుతో వున్న వ్యక్తి అమాంతం ఎగిరిపడిపోయే వాసుదేవరావుని రెండుచేతులాపట్టుకుని లేవనెత్తి వెంటనే తనదారిని గబగబ నడచిపోయేడు.

వాసుదేవరావు బట్టలు దులుపుకుని, 'థేంక్సు' అంటూ యిటూ అటూ చూసేసరికి ఆ వ్యక్తి కానరాలేదు. వెంటనే వాసుదేవరావు గబగబనడిచి తమకు రిజర్వుఅయిన పెట్టెవద్దకు చేరుకుని "అమ్మయ్యా" అని సామానుకోసం పిల్లలకోసం మాసూ టిక్కెట్లకోసం జేబులో పర్సుతియ్యబోగా పర్సు మాయమయింది. తనుయింటివద్దనుంచి పర్సు తెచ్చిన జ్ఞాపకముంది. బహుశా ఆ పడిపోవడంలో జారివుండాలి; అదెవడో లాగేసుండాలని "దొంగ–దొంగ–పర్సుపోయిం"దని కేకలుపెడుతూ అటూ యిటూ హడావిడిగా తిరిగేడు. ఇంతట్లో "ఎవరు–ఎక్కడ" అన్న ప్రశ్నలకు మితిలేదు. ఈ హడావిడిలో ప్లాట్‌ఫారంమీద జనమంతా వాసుదేవరావు చుట్టూమూగేరు. ఇంతట్లో పోలీసు కాన్స్టేబిల్సు చేరి జనాన్ని తోసుకు, వాసుదేవరావు నేవేవో ప్రశ్నించి అటూ యిటూ పరుగులెత్తేరు. ఈ జనాన్నంతా తప్పించు

కుని నాగేష్ తండ్రిని చేరేసరికి (టెయిను బయల్దేరి వెళ్ళిపోయింది.

నాగేష్ తండ్రిని పోలీస్ స్టేషనుకు తీసుకెళ్లగా వాసుదేవరావు వివరాలు చెబుతూ కంప్లెయింటు వ్రాసియిచ్చేడు. తిరువాత తిరిగి అంతా కలుసుకుని నిరాశచేసుకుని నెమ్మదిగా యిల్లుచేరుకున్నారు. నాగేష్‌ని పెండ్లి వారికి ప్రయాణం ఆగిపోయినట్లు తంతియివ్వమని చెప్పేడు వాసుదేవరావు. అందరూ శక్తిలేనట్టు ఎక్కడికక్కడ చతికిలబడ్డారు. చాలా సేపు నిశ్శబ్దంగా కూచున్నారు.

చివరకి ఉన్నట్టుండి శాంతమ్మ "అయితే ఎంతడబ్బుందా పర్సులో" అంది.

"పోయినంత - ఎంతయితే నేం - మీలో ప్రయాణాలు పెట్టుకుంటే ఎంతయినా పోతుంది. సొమ్ముకంటె ముఖ్యం-నా గౌరవం, మర్యాదా మట్టిగలసిపోతాయి. పెండ్లి పెద్ద రెయిలు తప్పిపోయేడంటే నవ్వుతుంది లోకం" అన్నాడు వాసుదేవరావు.

"అది సరేలెండి. అసలు పోయిన సొమ్మెంత?"

"టిక్కట్లతో కలసి 2 వేల రూపాయలు. అంతా రసాభాసయింది. ఈపిల్లకి మరీ మరీ చెప్పేను: ఈ ముహూర్తం నాగేష్ జాతకాన్ని బట్టి చాలాబాగుంది. తప్పడానికి వీల్లేదని చెప్పి ఆ క్లబ్ కట్టిపెట్టమన్నా. ఏదో ముసలాళ్ళ చాదస్తంగాని 5 గంటలకు తిరిగిరానా" అని బయల్దేరింది. దాన్తోటే వచ్చిందీ ముప్పంతా.

రూప కంటతడిపెట్టుకుని "నాన్నా! ఈవిధంగా పరిస్థితులు తారుమారవుతాయని నే ననుకున్నానా? మీరువద్దంటే అసలా క్లబ్బుకె వెళ్ళను నేను", అంది.

వాసుదేవరావు "నీకు తెలుసుండీ నువ్వు చేసేవన్నానా? ఇలాంటి వన్నీ జరుగుతాయని ఎవరుమాత్రం ఊహించగలరు. మనం ముందుగా బయల్దేరుంటే ఆందోళనవుండదు. ఇప్పుడేమనుకుంటే యేంలాభం. లేచిన వేళ బాగులేదు. ఇది నీతప్పూ కాదు. నా తప్పూ కాదు. నువ్వు కంటనీరు పెట్టుకోకు" అన్నాడు.

అంతలో శాంతమ్మ "అసలు పిల్లి ఎదురైంది, మనం బయల్దేరుతూండగా. అప్పుడే అంటే మీకేం కోపంవస్తుందో అని భయపడ్డాను," అంది.

"మంచిపని చేసేవులే" అన్నాడు వాసుదేవరావు.

"అయినా నాకెందుకు బాబూ-రూపా! ఆ వంటవాడ్ని కేకేసి వంట మొదలెట్టమను. 10 గంటలకేనా రెండు మెతుకు లుడికించి పడేస్తాడు" అంది శాంతమ్మ

రూప వంటయేర్పాట్లు చేయించింది.

అంతా భోజనాలు పూర్తిచేసుకుని ఎవరిగదుల్లో వారు నిద్రపోయేరు. మరునాడు ఉదయం తెల్లవారగానే 6 గంటలకు కాఫీ త్రాగి అప్పుడేవచ్చిన పేపరు చేత్తోపట్టుకుని హాలులో సోఫామీద కూచుని, వాసుదేవరావు కళ్ళజోడు తగిలించుకుని పేపరు విప్పి చదువుతూ, దిగ్గునలేచి నిలబడి మరోసారి పేపరుచూసి, గబగబా పోర్టికోలోకి నడిచి, డ్రైవరుని కేక వేసి, కారు బయటికి తెప్పించి కారులో కూచుంటూ ఉండగా శాంతమ్మ, కళ్ళు నులుపుకుంటూ నాగేషూ హాల్లోకి వచ్చేరు.

శాంతమ్మ "అబ్బాయీ! ప్రొద్దుటే ఎక్కడికిరా బయల్దేరేరు" అన్నది.

నాగేష్ అదే తనకూ అర్థంకాలేదని పోర్టికోలోకి వెళ్లేసరికి కారు వెళ్లిపోయింది. గేటుతలుపు మూసివచ్చి బంట్రోతునడగగా తనకీ తెలియదని వాడు వెళ్లిపోయేడు. నాగేష్ అలాగే 5 నిముషాలు ఆలోచిస్తూ నిలబడి నెమ్మదిగా లోనికిపోయి కాలకృత్యాలు నెరవేర్చుకున్నాడు.

వాసుదేవరావు తిన్నగా రైల్వే పోలీస్ స్టేషనుకు వెళ్ళేడు. అప్పుడే సబిన్స్పెక్టరు డ్యూటీకివస్తున్నాడు.

వాసుదేవరావు "నమస్కారం ఇన్స్పెక్టరుగారూ దొంగని మొత్తానికి పట్టేరుట" అన్నాడు.

"దొరక్క యెక్కడికి పోతాడు సార్. మనిషిని చూస్తేమటుకు మీరు దొంగనలేరు. అటువంటి టిప్ టాప్ డ్రెస్‌లో వున్నాడు. చాలా పెద్దరకం దొంగ"

"నిజంగా మీమేలు మరచిపోలేను. ఒకటా రెండా సర్. 2 వేల రూపాయిలవగదు. ఈ పెళ్లివల్ల అంతమొత్తం జేబులో వుంచుకోవలసొచ్చింది."

"మీ పర్సులో ఓ కానీకూడా పోకుండా దొరికింది. అసలు పర్సు పారేసి తను తప్పించుకుందామని చాలా ప్రయత్నం చేడు. పారేసిన పర్సు తీసుకుని వాడ్ని వెంబడించి చివరకి పట్టుగున్నాం. మొత్తానికి 8 చెరువులు నీళ్ళు తాగించేడు. అసలు మొదట్లో వొక మలుపు తిరిగితే పట్టుగోడం చాలా కష్టం అయివుండేది. మొత్తానికి నేనూ 804 కానిస్టేబులూ పట్టువిడవలేదు."

"మీకు నిజంగా డ్యూటీలో వున్న గురి చెప్పనలవికాదు సార్."

"రండి-మీశత్రువుని చూద్దురుగాని" అని సబ్ యిన్స్పెక్టరు వాసుదేవరావుని లోనికి తీసుకెళ్ళేడు. జెయిల్లో వున్న దొంగముఖం వాల్చుకుని వున్నాడు.

వాసుదేవరావు అతడ్ని చూసీ చూడ్డంతో వెంటనే సబిన్స్పెక్టరు చెయ్యి పట్టుకుని "అయ్యా! పెద్ద పొరపాటు జరిగిపోయింది" అన్నాడు.

సబిన్స్పెక్టరు "ఏమిటి సార్" అన్నాడు

దొంగ వెంటనే ముఖం ఎత్తి వాసుదేవరావుని చూసి గుర్తుపట్టి తనూ ఆశ్చర్యంగా చూసేడు.

వాసుదేవరావు సబ్ యిన్స్పెక్టరు గారితో దొంగకు కూడా వినపడేలాగే "సర్! ఈయన చాలా మర్యాదస్తుడు; దొంగకాదు. అసలు పర్సుపోయినప్పుడు నాకోసం గొంగను వెంటబెట్టేడీయన. ఈయన నాకు తెలుసును గూడాను. బహుశా పర్సు ఈయనవద్ద వుండడంవల్ల మీరు వెంబడిస్తే చికాకుబడి పరుగెటాడేమో కాని మరేం గాదు. మీరు పడ్డ శ్రమకి నేను యథాశక్తిగా




# పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్ని, నీ సరియైన చర్యనుగురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోష్టు కార్డుపైన నీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డువ్రాసిన తేదిలగాయతు 12 మాసములలోను నీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.

# ★ అతనెవరు ★

సంతోషపెడ్తాను. నాయందు దయయుంచి ఈయన్ని వెంటనే విడుదల చేయించండి. పాపం ఆ యిల్లాలు ఏంకని బెట్టుకూర్చుందో" అన్నాడు.

"వాసుదేవరావుగారూ-నాకేం చెప్పడానికీ తోచడంలేదు. మీరా పెద్దమనుషులు; చెబుతున్నారు. యీయన దొంగకాడని, మర్యాదస్థుడని-ఈయన్ని వెంబడించి పట్టుకున్నది నేనుకాకుంటే ఏమో మీ మాట నమ్మేవాణ్నేమో కాని యిప్పుడు నాకా నమ్మకం కించిత్తూ లేదు. ఇతను ఒకటోరకం దొంగని నేను సర్టిఫికేటు రాసిస్తాను. మీరింకో విషయం చూడాలి. నేనేం నిన్న మొన్న సర్వీసులో కొచ్చినవాణ్ని కాదు. రేపో నేడో ప్రమోషనుకోసం ఎదురు చూస్తున్న వాణ్ని. నా అనుభవాన్ని బట్టి చెప్పాలంటే మీరు చాలా పొరపాటుపడుతున్నారని చెప్పాలి. ఒకటయి వుండొచ్చు. ఇతడు మిమ్మల్ని మస్కాకొట్టే వుద్దేశంతో మొదట్నుంచీ మిమ్మల్ని తయారు చేసి ఉండాలి. అమాయకులవడంచేత మీరు మోసపోయేరు. నా సర్వీసులో ఇటువంటి కేసులు లక్షలు పట్టుకున్నాను. ఒకటీ పొరబడలేదంటే నమ్మండి. ఈ మధ్య జరిగిన ఖూనీ కేసులో నేచేసిన సర్వీసుకు నాకు ప్రెసిడెంటు మెడలు రాబోతూంది" అన్నాడు సబిన్స్పెక్టరు.

"అయ్యా! ఇన్స్పెక్టరుగారూ! మిమ్మల్ని ప్రతిమాలుకుంటున్నా—మీరు చెప్పినవన్నీ నాకూ నమ్మకంగానే వున్నాయి. కాని ఈ కేసుమట్టుకు నేను పొరబడంలేదు. నాయందు దయుంచి నా మాట నెరవేర్చండి. బాబూ దొంగని పట్టుకోరూ అని ప్రతిమాల్తే ఈయన పరుగెట్టేరు. అటువంటి ఉపకారికి నే నపకారం తలపెడితే నాకు పరమేనా దక్కుతుందంటారా? నా పర్సుయిప్పించి మీ బహుమానం మీరు గ్రహించి విడుదల చేయించి పెట్టండి" అన్నాడు వాసుదేవరావు.

సబిన్స్పెక్టరుకు వాసుదేవరావు చెప్పింది ఎంతమాత్రం నమ్మకం కలుగజెయ్యలేదు. కొసవరకూ అమాయకుడు పొరబడుతున్నాడనే నమ్మకంతో నేవున్నా "అయ్యా, మీరు అంతగా ప్రతిమాల్తూ ఉంటే మీవంటి పెద్దవారిని కాదనడానికి మనసొప్పకుండా వుంది. నామట్టుకి కష్టపడి పట్టుకున్న పులిని బోనునుండి విడిచిపెడుతున్నానేమో అనిపిస్తూంది" అన్నాడు.

"క్షమించాలి. మీ రలా అనొద్దు. మీకా అనుమానం ఎందుకూ, అసలు ఈయన్ని తిన్నగా మాయింటికి తీసుకెళ్లి వారివద్ద నా క్షమాపణ దాఖలు చేసుకుంటాను" అన్నాడు వాసుదేవరావు.

"సరేనని సబిన్స్పెక్టరు ఇనప్పెట్టెలోంచి పర్సుతీసి వాసుదేవరావుగారి పిటిషనులో వున్న వివరాలకు సరిపోతుందో లేదో మరోసారి చూసుకుని వాసుదేవరావుగారివద్ద పిటిషను విత్ డ్రా చేసుకుంటూన్నట్టు వ్రాయించుకుని పర్సు చేతిలో పెట్టేడు.

తరువాత జైలుగేటు తీయించి దొంగను బయటకు రప్పించి దొంగతో "అయ్యా! క్షమించాలి. నావల్లేదేనా పొరపాటుంటే క్షమించగోరుతున్నా. డ్యూటీలో ఏమేమో చెయ్యకతప్పదు. కాని నేనూ మానవుడనే అన్న విషయం మరచిపోకండి" అన్నాడు.

దొంగ "దానికేమిసార్-పొరపాటు మనిషి కాకపోతే మానుకొస్తుందా" అన్నాడు.

"నన్నూ క్షమించాలి" అన్నాడు వాసుదేవరావు.

దొంగ "బాగుంది. ఇప్పటికేనా నాకు విముక్తికలిగించినందుకు మిమ్మల్ని నేనే క్షమాపణ కోరుకోవాలి. మీరు రాకుంటే నేను దొంగనో కాదో తెలుసుకునేలోగా నే నాకు దేహశుద్ధి కావలసిందేగా. వారినీ ఏమనడానికి వీలులేదు. అంత కట్టుదిట్టంగా ఉండకపోతే నిజంబయటపడదు" అన్నాడు.


"బాగుందండోయి" అని పకాలున నవ్వి "మా ఇంటికి మొదట వెళ్లి అక్కడ్నుంచి మీరు మీ ఇంటికి వెళ్లొచ్చు దయచెయ్యండి" అన్నాడు వాసుదేవరావు.

"అయ్యా, ఇంకా ఎందుకు మీకు శ్రమ. నే వెళ్లిపోతాలెండి" అన్నాడు దొంగ.

"అబ్బే! అలా నే ఒప్పుకోను సుమండీ. మా ఇల్లు ఓసారి పావనం చేయించరూ" అంటూ దొంగచేయి పట్టుకుని తిన్నగా కారులో కూచోబెట్టుకుని వాసుదేవరావు ఇంటికి నడపమన్నాడు కారుని.

దారిలో దొంగని పేరు అడిగేడు. దొంగకి ఈ వాసుదేవరావు తనకీ గౌరవం ఎందుకిస్తున్నాడో ఏమీ అర్థంకావడంలేదు. ఏదో పొరబడుతున్నాడనే అనుకుంటూ పరధ్యాన్నంగా "నాపేరా అడిగేరు. బి. వి. షాఫ్ అంటారు. అంటే విశ్వనాధ లెండి" అన్నాడు. అంతల్లో కారు వాసుదేవరావుగారి ఇంటిముందు ఆగింది. వాసుదేవరావు దొంగ ఇద్దరూకలిసి లోనికి వెళ్లారు. బాత్ రూము చూపించి ముఖం కడుక్కోమన్నాని వాసుదేవరావు చెప్పేడు. ఇంటివద్ద అంతా వాసుదేవరావు రాకకి ఎదురుచూస్తూ కూచున్నారు. అందర్ని భోజనాలహాల్లో ఆ నూతనవ్యక్తితో ఫలహారాలకు సిద్ధంకమ్మని చెప్పేడువాసుదేవరావు. ఫలహారాలు పూర్తి చేసేకపిల్లలనుశాంతమ్మనుద్దేశించి "ఈవ్యక్తి ఎవరాఅని మీరంతా ఆశ్చర్యంగా చూస్తున్నారుగదూ. ఈయన మనపాలిట దేముడే అంటే నమ్మండి. మీరంతా వారికి నమస్కారంచెయ్యండి," అనిచెప్పి వాసుదేవరావు దొంగనుద్దేశించి "అయ్యా వీళ్లిద్దరూ నాపిల్లలూ—ఈమె నాభార్యా, మేమంతా మీకు చాలారుణపడ్డాము. ఆరుణం తీర్చుకో

( -వ పేజీ చూడండి)



# అతనెవరు

(34 వ పేజీ తరువాయి)

డం మాత్రం కాదు" అన్నాడు.

"అబ్బే—మీరు పొరబడుతున్నారు నాలో నిజానికి అంత గొప్పదనం లేదు. మీరిచ్చే గౌరవానికి నేను తగను" అన్నాడు దొంగ.

నాగేష్ తండ్రినిచూసి "నాన్నా! అదేదో వివరంగా నలుగురికీ అర్థమయేలా చెబితే మేము కూడా వీరినభినందించ గలుగుతామనుకుంటా" మన్నాడు.

"ఇదుగో చెపుతున్నాగా—ఈ రోజుని యీ కాఫీఫలహారాలు మనం సేవిస్తున్నామంటే, అది ఈ మహానుభావుడు పెట్టినభిక్షే. ఈసంగతి ఆయనకీ పూర్తిగా తెలియక పోవచ్చు. కాని భగవంతుడు యీయనలో దూరి మనకీమేలు కలుగజేసేడు" అంటూ దేముడికి నమస్కారం చేస్తూండగా వాసుదేవరావు కళ్ళవెంబట నీటిబిందువులు రాలేయి. దాన్తో విషయం తెలియకున్నా రూపా, తల్లికూడా కంటతడిబెట్టుకున్నారు. రూప నాన్నగారిని "నాన్నా ఏమిటో సరిగా చెప్పరూ" అని ముక్కు ఎగబీల్చింది. దొంగ తెల్లమొహం మేసుక్కూచున్నాడు.

ఆఖరుకు విషయం తేల్చేడు వాసుదేవరావు "నిన్న మనం తప్పిపోయిన ట్రెయిను రాత్రి ఒంటిగంటకు పట్టాలు తప్పి నదిలో పడిపోయింది. ఏడు, ఎనిమిది పెట్టెలలో జనం చాలామంది చనిపోయిఉంటారని ఈ వుదయం పేపరులో వార్త. ఆపడిపోయిన పెట్టెలలో మనరిజర్వుడు పెట్టెకూడావుంది. అందులో బహుశా ఎవరూ బ్రతికిఉండరని వార్త. మనంమాత్రం మృత్యువునోట్లోంచి ఊడిపడ్డాం. అంతా భగవన్మాయ. ఈయనలో ఆ భగవంతుడుదూరి నా పర్సు యీయనద్వారా దొంగిలించకపోతే మనకు ఈరోజు భూమిమీద తిండిఉండేదికాదుగదా. అసలు కుటుంబనాశనం అయిపోయేది. ఈ మహానుభావుడు కాపాడేడు. ఇప్పుడేనా తెలుసుకోండి యీ మహానుభావు డెవరో."

అప్పటివరకూ కులాసాగావున్న దొంగకి వంటినిండా చెమటలుపట్టడం మొదలుపెట్టాయి. నోటంటమాటరాక బాధపడుతున్నాడు. శాంతమ్మ, రూప, నాగేష్ కూడా దొంగకి నమస్కారం చేశారు.

దొంగ లేచినిలబడి "వాసుదేవరావుగారూ! క్షమించాలి. మీవంటి పెద్దమనిషివద్ద యీ విధంగా నే నడుచుకున్నందుకు చాలా సిగ్గుపడుతున్నాను. నన్ను క్షమించమని వేడుకుంటున్నాను. ఈరోజునుంచి యీపని మరి చెయ్యను. నామాటనమ్మండి" అని వారి రెండుచేతులూ పట్టుకుని చెప్పి వెళ్తూండగా టెలిగ్రాం వచ్చింది. ఆడపెళ్ళివారు కారణాంతరాలచేత పెండ్లి వచ్చేవారానికి మార్చుకున్నట్లు కబురు. ★


## 'అనాసిన్'

## నొప్పిని జయించుటకు

## నాలుగు మందుల కూడిక

**1. క్వినైన్ సల్ఫేట్ 2. ఫినాసిటిన్**

**3. కఫిన్ 4. అసిటిల్ సాలిసిలిక్ ఏసిడ్**

'అనాసిన్'—గొప్ప బాధానివారణి—వైజ్ఞానికంగా కూర్చబడిన నాలుగుమందులను గలిగియున్నది, అవి నరముల ముఖ్యస్థానము లందు సంయుక్తచర్యను జరిపి, తలనొప్పులు, జలుబులు, జ్వరము, దంతబాధ, కండ నొప్పులనుండి రూఢిగా, సురక్షితమైన శీఘ్రవిముక్తిని గలిగించును. బాధానివారణకు 'అనాసిన్' కంటె అతివేగముగా పనిచేయునట్టిది మరేదీ లేదు. సేవించుటకు 'అనాసిన్' కంటె అతి సురక్షితమైనట్టిది మరేదీ లేదు. జ్ఞాపకముంచు కొనుడు! 'అనాసిన్' వైద్యుని ఔషధయోగము వంటిది. అది గుండెలకు హానిగాని కడుపు ఉబ్బరముగాని కలిగించదు. 'అనాసిన్' లక్షలాది జనులకు బాధానివారణి ఎందుకనగా ప్రతివారున్ను 'అనాసిన్' ను కొనగలరు.

ఒక ప్యాకెట్ ధర 12 నయా పైసలు మాత్రమే.

**నాలుగు మందుల సూత్రమైన 'అనాసిన్' వాడుడు**




జాఫ్రి మేన్నర్స్ అండ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్. రిజిస్టర్డు ఉపయోగకులు.

(ఒక ప్యాకెట్ ధర 12 నయా పైసలు మాత్రమే